

# అంత్యాక్షరి

కేతు విశ్వనాథరెడ్డి

“అవ్వా!... అవ్వా! అవ్వోవ్!” సిటవుట్‌లో ఫైబర్ కుర్చీలో కూర్చుని పుస్తకం చదువుకుంటున్న దుర్గమ్మ మనుమరాలి మూడో పిలుపు వింది- సుషమ దగ్గరకొచ్చి కొంచెం బిగ్గరగా పిలవడం వల్ల. ‘అవ్వా’ అని పిలిపించుకోవడం అంటేనే దుర్గమ్మకు ఇష్టం.

నవ్వుతో సుషమను పలకరించింది. చదువుతున్న పేజీల మధ్య చూపుడు వేలుంచి పుస్తకం మూసింది.

“బోర్ కొడుతోంది అవ్వా,” ముఖం మీద పడుతున్న జుట్టు పాయల్ని చేత్తో తోసుకుంటూ సుషమ గోముగా అమ్మమ్మ దుర్గమ్మ దగ్గర నిలబడింది.

“ఇక్కడ కూర్చుందువుగాని రా పాపా,” దుర్గమ్మ తన కాళ్ల దగ్గర, అతి శుభ్రంగా మెరుస్తున్న పాలరాతి నేలమీద సుషమను మురిపెంగా కూర్చోబెట్టుకుంది. మెడవరకు కత్తిరించుకున్న నూనె పెట్టుకోని సుషమ జుట్టును దుర్గమ్మ ముచ్చటగా సరిచేస్తూ అడిగింది.

“ఇప్పుడు చెప్పు పాపా.”

“చెప్పాకదా- బోరుబోరుగా ఉందని,” దుర్గమ్మ కాళ్ల దగ్గర మధ్య చీర మడతల్లో సుషమ తలదాచుకుంది. కాసేపు ముక్కుతో రాసింది. గారాలు పోయింది.

“ఎందుకు పాపా ఉన్నట్టుండి ‘బోర్‌గా ఉంది’ అంటావు,” పుస్తకం తీసి పక్కన పెట్టింది. సుషమ వీపు నిమిరింది. లేపి తన పక్క కుర్చీలో కూర్చోబెట్టుకుంది.

“బోరెందుకో నాకు తెలియదు,” సుషమ అమాయకంగా, నిశ్చిత స్వరంతో అంది.

“ఎన్ని పనులు చేసినావో చెప్పు. నీకెందుకు విసుగొచ్చిందో చెప్తా.”

“హోంవర్కు సగం పూర్తిచేశా. కామిక్స్ కొన్ని చదివా. బోరు కొట్టింది.”

“తర్వాత... వరసగా చేసిన పనులన్నీ చెప్పు వింటా.”

“కంప్యూటర్ గేమ్ ఆడుకున్నా. ఒక అరగంట టీవీలో నాలుగైదు చానల్స్ చూశా. అన్నీ బోరే.”

“తర్వాత...”

“కాసేపు మ్యూజిక్ విన్నా. తర్వాత వీసీఆర్ పెట్టుకున్నా. మా ఫ్రెండు వచ్చింది. నేనూ అదీ చైనీస్ చెకర్ ఆడుకున్నాం.”

“తర్వాత...”

“క్యారమ్స్ ఆడుకున్నాం. ఆ తర్వాత వర్డ్ బిల్డింగ్ ఆడుకున్నాం. బోరు కొట్టింది. మా ఫ్రెండుకు చెప్పా. ‘నీకెప్పుడూ బోరే’ అంటూ అది విసుక్కొని వెళ్లిపోయింది. నాకు మాత్రం బోరు- ఏం చెయ్యాలి!”

“పాపా! నువ్వు ఏ పనీ పూర్తి చెయ్యలేకపోయినా నంటావు అంతేనా?” దుర్గమ్మ అనునయంగా అడిగింది.

“పోనీలే. ఆ పి... పి... పిస్... తుళ్లు...” సుషమ తుళ్లి తుళ్లి నవ్వింది.

“పిస్తుళ్లు, పిస్తుళ్లు. ఇంతకుముందు పలికినావు,” దుర్గమ్మ సుషమ బుగ్గ సాగదీసింది.

“ఆ పిస్తే... పిస్తుళ్లు ఎలా ఆడతారు?”

“ఆడపిల్లలు గొంతుక్కూర్చుంటారు. తమ కుచ్చెళ్లు అడ్డుపడకుండా చూసుకొని కాళ్లను ముందుకూ, వెనక్కూ వేగంగా ఆడిస్తూ ఆడతారు.”

“ఏదీ, ఎలా? అవ్వా అవ్వా నాకు నేర్పించవా?” దుర్గమ్మ గడ్డం పట్టుకొని ప్రాధేయపడింది.

చదువూ, పనిమనిషి తోడు సుషమ ప్రపంచం. ముగ్గురి మధ్యా పెద్దగా మాటలులేని ప్రపంచం. కూతురూ, అల్లుడి బెడ్‌రూమ్ తప్పితే ఎవరి గదులు వాళ్లవి- అతిథులకు కేటాయించిన మేడమీది రెండు గదులు కాక.

'ఈ ఇంట్లో చాలాచాలా ఉన్నాయి. కానీ, ఏదో వెలితి ఉంది. ఏం వెలితి అది? సుషమ రూపంలో కనపడేదా? మరొకటా?' దుర్గమ్మ తల బద్దలుకొట్టుకొని ఆలోచించింది. ఆ సందర్భంలోనే దుర్గమ్మకు తన పల్లెటూరు జ్ఞాపకానికి వచ్చింది. భర్త మనసులో మెదిలాడు.

ఆయన కూతురి గృహప్రవేశానికి రాలేదు. 'నువ్వు పోయిరా,' అన్నాడు. రిటైరయ్యాక ఆయనకు ఉన్న ఊరే సర్వస్వమైపోయింది. ముప్ఫయ్యేళ్లుగా తనకు తెలిసిన హోమియో వైద్యం చేస్తున్నాడు- పేదాసాదాకు. పైసా తీసుకోడు. ఇంటి దగ్గరకు వచ్చిన పిల్లలకు నాలుగు ముక్కలు చెప్తాడు. డబ్బు తీసుకోడు. 'ఉద్యోగంలో తీసుకున్నది, తీసుకుంటున్నది చాలులే,' అంటాడు. ఊరి రాజకీయాలలో వేలు పెట్టడు. మిగిలిన పిత్రార్జితం ఇల్లుంది. ఒక ఎకరా తోట ఉంది. తోటపని ఇద్దరూ కలిసి చేస్తారు. తను ఆడపిల్లలకు చదువు చెప్తుంది. కాలక్షేపానికి ఒక రేడియో ఉంది. నలుపు తెలుపు టీవీ ఉంది. టీవీకి వచ్చే నలుగురి సందడీ ఉంది.

దుర్గమ్మకు తన భర్తతోడి జీవితమే ఇక్కడికంటే మెరుగనిపించింది. నగర జీవితంలోని కూతురి ఇంటితో పోల్చి ఆలోచించింది. తన ఊళ్లోది ఒకరకంగా గుంపు చలనం, ఇక్కడిది మరీ ఒంటిగాళ్ల చలనం అనుకుంది. ఈ చలనంలో అన్నీ ఉన్నాయి. దేనికీ స్తిమితం లేదు. 'బోర్ - పరమ బోర్,' మనుమరాలి బాష తనకు వారం రోజుల్లోనే అబ్బింది.

దుర్గమ్మ కోడినిద్రలోకి జారుకుంది.

*

దుర్గా వాళ్లమ్మ రామసుబ్బమ్మ దుర్గ మీద కేకలు వేస్తోంది.

"పెద్దమనిషయినావు. పైట వేసుకుంటాండావు. రాత్రయిందంటే ఆ పిస్తుళ్లు- ఆ ఎగుర్లాటలు. ఇక యికలూ పకపకలూ. మీ నాయనకు చెప్తే, 'చిన్నపిల్ల, పోనీలే,' అంటాడు. మాయమ్మకు నేను కూడా చిన్న పిల్లనే. పద్నాలుగేండ్లు నెత్తిమీంద కొచ్చినాయి. ఇంకా ఆటలూ పాటలూ"

"అమ్మా ఈ పొద్దు పున్నమి... వెన్నెల."

"నీకు పున్నమేనమ్మా. వెన్నెలే తల్లీ! నాకు మాత్తరం ఎప్పుడూ చీకటే. నా రాత. పుట్టింది ముగ్గురూ ఆడ దయ్యాలే. పెద్దోళ్లిద్దరికీ ఎట్లాగో పెండ్లిండ్లు అయినాయి. ఆ పార్టీల కొంపల్లో వాళ్ల చావులు వాళ్లు చస్తాండారు. నువ్వు స్కూలుకు పోతానని మొత్తుకున్నావు. మీ నాయన సై అన్నాడు. నాకొచ్చిపడింది. పాపం! స్కూలుకు రెండు మైళ్లు నడిచిపోతాండవని టిపిను కారియరు ఏర్పాటుచెయ్యాల. నీకు చదువు. నాకు ఇంట్లో పని, బయట పని. నీకు నీ సావాసగాళ్లు కావాల. పున్నమి గావాల, వెన్నెల గావాల. మరి నాకో? ఇంట్లో ఈ చట్లా కుండలూనా? ఇదో ఈ గాటిపాట ఎనుములూ, ఎద్దులూ, పడ్డలూనా? ఈ చీకటా?"

అమ్మ దోనిలో కడుగునీళ్లు పోస్తున్న చప్పుడు.

దుర్గమ్మ ఉలిక్కిపడి కళ్లు తెరిచి చూసింది. ఎదురుగా పనిమనిషి మొక్కలకు నీళ్లు పడుతూ కనిపించింది. దుర్గమ్మ చేతి గడియారం చూసుకుంది. సాయంత్రం అయిదు గంటలు దాటింది.

సుషమ గుర్తుకొచ్చి, దుర్గమ్మ మనసు చివుక్కుమంది. "ఏదన్నా తిందో లేదో పాపం," అనుకుంటూ దుర్గమ్మ సుషమ గదికి వచ్చింది. మంచానికి అడ్డంగా బోర్లపడి సుషమ నిద్రపోతూ కనిపించింది.

పరుపు మీద ఈ పక్క వాక్‌మన్ పడి ఉంది. ఆ పక్క పత్రికలూ, పుస్తకాలూ పడి ఉన్నాయి. దుర్గమ్మ సుషమను లేపలేకపోయింది. సిటవుట్‌లోకి వెళ్లి మళ్లీ పుస్తకాన్ని పట్టుకుంది. కాసేపటికి మళ్లీ కునికింది.

*

స్రవంతిని దుర్గ మందలిస్తోంది. "మగపిల్లలతో పూసుకొని తిరగద్దు స్రవంతీ!"

"నోట్సులిచ్చుకోవడం, తీసుకోవడం తప్పా? మాట్లాడితే తప్పా అమ్మా?"

భర్త కలుగ చేసుకుంటున్నాడు. "ఆడపిల్లలూ, మగపిల్లలూ కలిసి చదువుకుంటున్నారు. నీకు తెలియందేముంది? ఎవరి జీవితాన్ని వాళ్లు దిద్దుకుంటారు."

*

"చూడు. కర్నూలు నుంచి స్రవంతి ఉత్తరం. కులాంతర వివాహం చేసుకుందట, భర్త తరపు వాళ్లతో గొడవ అవుతుందని భయపడిందంట. 'మావాళ్లకూ ఈ విషయం తెలియకూడదు. మీవాళ్లకూ తెలియకూడదు. అన్నీ అవే సర్దుకుంటాయి,' అని అతను అన్నాడంట. తాను సరేనందట. ఇక కన్నవాళ్లతో పనేముంది?" దుర్గమ్మ కళ్లు ఒత్తుకుంది.

